# ఆకాశవాణి, ప్రాంతీయ వార్తా విభాగం

## విశాఖపట్నం కేంద్రం

## జాతీయ వార్తలు

తేదీ: 01-09-2026 సమయం : రాత్రి 8గం. 30ని.లు

## ముఖ్యాంశాలు

- వివాదాలను చర్చలు, దౌత్యం ద్వారానే పరిష్కరించుకోవాలని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఎస్.సీ.ఓ. శిఖరాగ్ర సమావేశంలో ఉద్ఘాటించారు.

- రైతు ఆదాయాన్ని మెరుగుపరచడమే వాటర్‌షెడ్ డెవలప్‌మెంట్ కాంపోనెంట్ లక్ష్యమని కేంద్రమంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్ అన్నారు.

- సాంకేతిక మార్పులకు అనుగుణంగా పాఠ్యాంశాలు కూడా అభివృద్ధి చెందాల్సిన అవసరం ఉందని కేంద్రమంత్రి ప్రహ్లాద్ జోషి అభిప్రాయం వ్యక్తం చేశారు.

- నీట్ ప్రశ్నాపత్రం లీకేజ్‌కు సంబంధించిన నిరసనల నేపథ్యంలో దేశవ్యాప్తంగా విద్యార్థులపై నమోదైన FIR లను కొట్టివేయాలని సుప్రీంకోర్టు ఆదేశించింది.

================================

యుద్ధాలు, సంఘర్షణలు ఏ సమస్యకూ పరిష్కారం కాదని, అన్ని వివాదాలను చర్చలు, దౌత్యం ద్వారానే పరిష్కరించుకోవాలని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అన్నారు. కిర్గిజ్‌స్థాన్ రాజధాని బిష్కెక్ నగరంలో ఈరోజు జరిగిన షాంఘై సహకార సంస్థ (SCO) 26వ శిఖరాగ్ర సమావేశంలో ప్రధానమంత్రి మాట్లాడుతూ.. ప్రపంచంలోని వివిధ ప్రాంతాలలో కొనసాగుతున్న సంఘర్షణల పట్ల ఆందోళన వ్యక్తం చేశారు. ఉగ్రవాదానికి నిధులు సమకూర్చడం, తీవ్రవాద భావజాల వ్యాప్తి, ఉగ్రవాద సురక్షిత స్థావరాలు వంటి మొత్తం వ్యవస్థను నిర్మూలించాలని ఆయన సభ్య దేశాలన్నింటికీ పిలుపునిచ్చారు. మార్కెట్లను అనుసంధానించేవి, వాణిజ్యాన్ని సులభతరం చేసేవి, అభివృద్ధికి కొత్త మార్గాలను తెరిచే అన్ని ప్రయత్నాలకు భారత్ మద్దతు ఇస్తుందన్నారు. అయితే, ఇటువంటి ప్రయత్నాలు.. అన్ని దేశాల సార్వభౌమత్వాన్ని, ప్రాదేశిక సమగ్రతను పూర్తిగా గౌరవించాలని నరేంద్ర మోదీ స్పష్టం చేశారు. శిఖరాగ్ర సమావేశం అనంతరం.. SCO వార్షికోత్సవం సందర్భంగా సభ్య దేశాల నాయకులు బిష్కెక్ ప్రకటనపై సంతకాలు చేశారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

భూ ఉత్పాదకతను, రైతుల ఆదాయాన్ని మెరుగుపరచడమే వాటర్‌షెడ్ డెవలప్‌మెంట్ కాంపోనెంట్ లక్ష్యమని కేంద్ర గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్ అన్నారు. న్యూఢిల్లీలో ఆయన ఈరోజు ప్రధానమంత్రి కృషి సించాయి యోజన (PMKSY)లోని వాటర్‌షెడ్ డెవలప్‌మెంట్ కాంపోనెంట్ (WDC-PMKSY) పురోగతిని సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అభివృద్ధి చెందిన భారతదేశం - కరువు రహిత భారతదేశం అనే లక్ష్యాన్ని సాకారం చేయడంలో వాటర్‌షెడ్ అభివృద్ధి ముఖ్యమైన సాధనమని అన్నారు. ప్రాజెక్టుల వేగవంతమైన అమలును, క్షేత్రస్థాయిలో ఫలితాలను సాధించేలా చూడాలని రాష్ట్రాలకు పిలుపునిచ్చారు. వాటర్‌షెడ్ డెవలప్‌మెంట్ కాంపోనెంట్ - ప్రధానమంత్రి కృషి సించాయి యోజన 2.0 పథకం కింద, ఇప్పటివరకు సుమారు 53 లక్షల హెక్టార్ల విస్తీర్ణంలో వెయ్యికి పైగా ప్రాజెక్టులకు ఆమోదం లభించిందని కేంద్రమంత్రి తెలియజేశారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

నీట్ ప్రశ్నాపత్రాల లీకేజ్‌కు సంబంధించి నిరసనలు చేపట్టిన విద్యార్థులపై దేశవ్యాప్తంగా నమోదైన FIR లను కొట్టివేయాలని సుప్రీంకోర్టు ఆదేశించింది. ఈ కేసులను కొనసాగించరాదని, దర్యాప్తు చేయకూడదని, అన్ని విధాలుగా వాటిని మూసివేయాలని స్పష్టం చేసింది. అలాగే.. కేంద్ర ప్రభుత్వం, ఢిల్లీ పోలీసులు, బీహార్, పశ్చిమ బెంగాల్, మహారాష్ట్ర, అసోం ప్రభుత్వాలు దాఖలు చేసిన పిటిషన్లలో పేర్కొన్న విద్యార్థుల నిరసనలకు సంబంధించిన FIR లను కూడా సుప్రీంకోర్టు రద్దు చేయడంతో పాటు ఈ ఆదేశాన్ని దేశవ్యాప్తంగా వర్తింపజేసింది. నిజాయితీగా నిరసనల్లో పాల్గొన్న విద్యార్థుల భవిష్యత్‌ను దృష్టిలో ఉంచుకుని ఈ ఆదేశం జారీ చేసినట్లు కోర్టు పేర్కొంది. అయితే.. జంతర్ మంతర్ నిరసనల్లో పాల్గొన్న 2 వేల 873 మంది తీవ్రమైన నేర చరిత్ర కలిగిన వ్యక్తులపై నమోదైన ఒక FIRను మాత్రం కొనసాగించడానికి ఢిల్లీ పోలీసులకు సుప్రీంకోర్టు అనుమతినిచ్చింది.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

ఈ నెల 5వ తేదీన తలపెట్టిన నిరసనను విరమించాలన్న కాక్రోచ్ జనతా పార్టీ (సీజేపీ) నిర్ణయాన్ని ప్రభుత్వం స్వాగతించింది. కేంద్ర ఆరోగ్య శాఖ మంత్రి జగత్ ప్రకాష్ నడ్డా న్యూఢిల్లీలో ఈరోజు పాత్రికేయులతో మాట్లాడుతూ... నిరసనలో పాల్గొన్న విద్యార్థులపై నమోదైన కేసులను ఉపసంహరించుకుంటామని, భవిష్యత్‌లో వారిపై ఎటువంటి కఠిన చర్యలు తీసుకోబోమని హామీ ఇచ్చారు. బీజేపీ పాలిత రాష్ట్ర ప్రభుత్వాలతో సంప్రదింపులు జరిపిన తర్వాతే.. తాము ఆ హామీని నెరవేరుస్తున్నామని స్పష్టం చేశారు. యువత పురోగతి, అభివృద్ధికి ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యతనిస్తోందని జేపీ నడ్డా స్పష్టం చేస్తూ...

(వాయిస్ 25 సెకన్లు)

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

కాలం గడిచే కొద్దీ కృత్రిమ మేధ (AI) సమాజంలో మరింతగా కలిసిపోతోందని కేంద్ర విద్యా శాఖ మంత్రి ప్రహ్లాద్ జోషి అన్నారు. నేషనల్ కౌన్సిల్ ఆఫ్ ఎడ్యుకేషనల్ రీసెర్చ్ అండ్ ట్రైనింగ్ (NCERT) 66వ వ్యవస్థాపక దినోత్సవం సందర్భంగా న్యూఢిల్లీలో ఈరోజు జరిగిన ఒక కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ... విద్యార్థులు అభ్యాసనం కోసం, వారి దైనందిన కార్యకలాపాలలోనూ AIని ఉపయోగిస్తున్నారని చెప్పారు. వేగవంతమైన సాంకేతిక మార్పులకు అనుగుణంగా పాఠ్యపుస్తకాలు, పాఠ్యాంశాలు కూడా అభివృద్ధి చెందాల్సిన అవసరం ఉందని ఆయన అభిప్రాయం వ్యక్తం చేశారు. ఇది యువ అభ్యాసకులు AIని అర్థం చేసుకోవడానికి, దానిని ఆత్మవిశ్వాసంతో, బాధ్యతాయుతంగా ఉపయోగించుకోవడానికి సహాయపడుతుందని కేంద్రమంత్రి పేర్కొన్నారు.

విరామం

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

వాతావరణ మార్పులు, కాలుష్యం, వనరుల క్షీణత వంటి పర్యావరణ సవాళ్లకు సమగ్రమైన, సహకార పరిష్కారాలు అవసరమని కేంద్ర పర్యావరణ, అటవీ, వాతావరణ మార్పుల శాఖ మంత్రి భూపేందర్ యాదవ్ అన్నారు. న్యూఢిల్లీలో ఈరోజు జరిగిన 4వ ఇండో-జర్మన్ పర్యావరణ ఫోరమ్ ప్రారంభ సమావేశానికి ఆయన.. జర్మనీ మంత్రి కార్స్టెన్ ష్నైడర్‌తో కలిసి అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా భూపేందర్ యాదవ్ మాట్లాడుతూ... వాతావరణ మార్పులను తట్టుకోగల భవిష్యత్‌ను నిర్మించడంలో సహకారం అవసరమని స్పష్టం చేశారు. పర్యావరణ ఆశయం, ఆర్థికాభివృద్ధి అనేవి పరస్పరం పోటీపడే లక్ష్యాలు కానవసరం లేదని భారతదేశ అభివృద్ధి నిరూపించిందని చెప్పారు. కార్యక్రమంలో భాగంగా అంతర్జాతీయ ప్రాముఖ్యత కలిగిన చిత్తడి నేలల పరిరక్షణ, వినియోగంపై భారత్ - జర్మనీ దేశాలు ఉమ్మడి ప్రకటనపై సంతకాలు చేశాయి.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

దేశ వార్షిక రక్షణ ఉత్పత్తి 2029 నాటికి 3 లక్షల కోట్లు, రక్షణ ఎగుమతులను 50 వేల కోట్ల రూపాయలకు చేర్చడమే ప్రభుత్వ లక్ష్యమని రక్షణ శాఖ సహాయ మంత్రి సంజయ్ సేథ్ తెలిపారు. న్యూఢిల్లీలోని సెంటర్ ఫర్ జాయింట్ వార్‌ఫేర్ స్టడీస్ (CENJOWS) ఈరోజు నిర్వహించిన రెండవ వార్షిక ట్రైడెంట్ లెక్చర్‌లో ఆయన మాట్లాడుతూ.. దేశ రక్షణ ఉత్పత్తి సుమారు లక్షా 78 వేల కోట్ల రూపాయలకు చేరుకుందన్నారు. స్వదేశీ రక్షణ వ్యవస్థలు, ఉత్పత్తి సామర్థ్యాలపై దేశం ఎక్కువగా ఆధారపడుతూ.. రక్షణ రంగం పెద్ద పరివర్తనకు సాక్ష్యంగా నిలుస్తోందని చెప్పారు. 1947 తర్వాత తొలిసారిగా భారత్.. స్వదేశీ వ్యవస్థను ఉపయోగించి 'ఆపరేషన్ సిందూర్'ను చేపట్టిందని, ఇది దేశ రక్షణ స్వావలంబనకు ప్రతీకగా నిలుస్తుందన్నారు. పశ్చిమాసియాలో అనిశ్చిత పరిస్థితులు నెలకొన్న తరుణంలోనూ భారత్ 7.8 శాతం జీడీపీ వృద్ధిని నమోదు చేసిందని సంజయ్ సేథ్ వెల్లడిస్తూ...

(వాయిస్ 30 సెకన్లు)

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

నేపాల్ విషాద సమయంలో మానవతా సహాయం, సహాయక చర్యలలో సశస్త్ర సీమా బల్ (SSB) ప్రశంసనీయమైన పాత్ర పోషిస్తోందని కేంద్ర హోం మంత్రి అమిత్ షా అన్నారు. SSB పదవీ స్వీకార కార్యక్రమం సందర్భంగా ఆయన ఒక సందేశాన్ని విడుదల చేస్తూ.. సంక్షోభ సమయాల్లో SSB తీసుకునే వేగవంతమైన, సున్నితమైన చర్యలు దాని నినాదమైన సేవ, భద్రత, సౌభ్రాతృత్వాలకు సజీవ సాక్ష్యంగా నిలుస్తాయని పేర్కొన్నారు. సరిహద్దుల్లో మోహరించిన ప్రతి SSB జవాన్.. దేశానికి అప్రమత్తమైన సంరక్షకుడని, విపత్తుల సమయంలో తొలి స్పందనదారుడని, భారతదేశ సద్భావనకు రాయబారి అని ఆయన అభివర్ణించారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

తూర్పు మధ్య రైల్వే సమస్తిపూర్ డివిజన్ పరిధిలోని 21 స్టేషన్లలో ఎలక్ట్రానిక్ ఇంటర్ లాకింగ్ కోసం భారతీయ రైల్వే 233 కోట్ల రూపాయలను ఆమోదించింది. ఈ ఆధునిక సిగ్నలింగ్ వ్యవస్థ డివిజన్ అంతటా సిగ్నలింగ్ మౌలిక సదుపాయాలను బలోపేతం చేస్తుందని, స్వదేశీ ఆటోమేటిక్ ట్రైన్ ప్రొటెక్షన్ సిస్టమ్ అమలును సులభతరం చేస్తుందని రైల్వే మంత్రిత్వ శాఖ తెలిపింది. అలాగే.. ఉత్తర రైల్వే పరిధిలోని మొరాదాబాద్ డివిజన్ పరిధిలో 712 కిలోమీటర్ల మేర కవచ్ 4.0 కోసం రైల్వే శాఖ 170 కోట్ల రూపాయలను ఆమోదించింది. స్వదేశీ ఆటోమేటిక్ ట్రైన్ ప్రొటెక్షన్ సిస్టమ్‌ను అమలు చేయడం ద్వారా ఈ పనులు రైల్వే భద్రత, మౌలిక సదుపాయాలను బలోపేతం చేస్తాయని మంత్రిత్వ శాఖ వెల్లడించింది.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

ప్రభుత్వ అభివృద్ధి పథకాలకు ఏ కులం కాని, వర్గం కాని దూరం కాకుండా ఉండేలా చర్యలు తీసుకుంటున్నామని కేంద్ర సామాజిక న్యాయం, సాధికారత శాఖ మంత్రి డాక్టర్ వీరేంద్ర కుమార్ తెలిపారు. న్యూఢిల్లీలో ఈరోజు జరిగిన `సమావేశ్ ఉత్సవ్`లో ఆయన మాట్లాడుతూ.. డీ-నోటిఫైడ్, గిరిజన వర్గాల సాధికారత కోసం ప్రభుత్వం కృషి చేస్తోందని చెప్పారు.

=================================

=================================